

## రాజన్న హుండీ ఆదాయం
# రూ.3.68కోట్లు

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ రాజన్నకు 39 రోజుల్లో హుండీ ఆదాయం రూ.3,68,61,568 నగదు, 577.700 గ్రాముల బంగారం, 32.350 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోదెరెడ్డి తెలిపారు. రెండోరోజు బుధవారం లెక్కింపులో భాగంగా రూ.1,79,91,871 నగదు రాగా, 217.600 గ్రాముల బంగారం, 18.200 కిలోల వెండి సమకూరినట్లు పేర్కొన్నారు. తొలిరోజు మంగళవారం రూ.1,88,69,697 నగదు, 60 గ్రాముల బంగారం, 14కిలోల వెండి సమకూరింది.

హుండీ లెక్కిం పులో ఏఈఓతో పాటు పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, కరీంనగర్ ఏసీ ఏ.చంద్రశేఖర్, కరీంనగర్ గోవిందా సతీ సేవా సమితి నిర్వాహ కులు భాగ్యలక్ష్మి, శైలజా రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చూశారు.

## ఘనంగా కేకే మహేందర్‌రెడ్డి
# జన్మదిన వేడుకలు



**సిరిసిల్ల, ప్రజానావ:** కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం సిరిసిల్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కేకే మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని శివ నగర్ లో ఉన్న రావుస్ హైస్కూల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు అడ్డగట్ల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోటుబుక్కులు,పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడ్డగట్ల శంకర్ మాట్లాడుతూ పదవిలో లేకున్నా కేకే మహేందర్ రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్య శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నటుడు రాజ్‌తరుణ్‌పై
# నార్సింగ్‌లో కేసు




### లావణ్య ఫిర్యాదుతో నమోదు

**హైదరాబాద్, ప్రజానావ:** సినీ నటుడు రాజ్ తరుణ్ పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే యువతి ఫిర్యాదు మేరకు 420, 506, 493 సెక్షన్ల కింద రాజ్ తరుణ్ పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. రాజ్‌తరుణ్, తాను 2012 నుంచి రిలేషన్‌లో ఉన్నామని, ఇటీవల మరో సినీనటితో అతను సన్నిహితంగా ఉన్నట్టు తెలిసిందని లావణ్య ఫిర్యాదులో పేర్కొంది. 'తిరగబడర సామీ' సినిమా షూటింగ్ జరిగినప్పటి నుంచి ఈ రిలేషన్ కొనసాగిస్తున్నట్టు తేలిందని, ఇదే విషయమై అతన్ని నిలదీస్తే తనని దుర్భాషలాడాడని తెలిపింది. తనను బెదిరించారని, సంబంధం లేని కేసులో ఇరికించడంతో తాను 43 రోజులు జైల్లో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. 'రాజ్‌తరుణ్‌తో నాకు పదేళ్ల క్రితమే వివాహ మైంది. ఇద్దరం కలిసే జీవిస్తున్నాం. కొన్నాళ్ల క్రితం నాకు అబార్షన్ చేయించాడు. ఇద్దరం కలిసి విదేశాలకు కూడా వెళ్లాం' అని అందుకు సంబంధించి కొన్ని ఆధారాలను లావణ్య పోలీసులకు చూపించారు. దర్యాప్తు చేసిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

# ప్రకృతిని కాపాడే బాధ్యత అందరిది

- వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**వేములవాడ, ప్రజానావ:** ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణం బాలానగర్‌లో బుధవారం వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పుడు ఉన్నా పరిస్థితుల్లో అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగ్యస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అటవీ సంపదను కాపాడుకోవడానికి ఇప్పటికే చర్యలు చేపట్టిందని, రానున్న రోజుల్లో నీడను ఇచ్చే చెట్లతో పాటు, వన్యప్రాణులకు పండ్లు, ఫలాలిచ్చే చెట్లను పెంచేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను కాపాడాలన్నారు. వేములవాడ పట్టణంలో ప్రతి కాలనీలో పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా మొక్కలు, పూలచెట్లను నాటాలని పిలుపునిచ్చారు.

# మహిళను నమ్మించి ప్లాట్ రిజిస్ట్రేషన్

- అడిగితే కులం పేరుతో దూషిస్తూ బెదిరింపు
- నిందితుడు ఒడ్యాల వేణు రిమాండ్
- ఇప్పటికే వేములవాడ, కరీంనగర్ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు
- వేణుపై రౌడీషీట్ ఓపెన్ చేశాం
- మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ : సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



**సిరిసిల్ల, ప్రజానావ:** ఓ మహిళను నమ్మించి ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, డబ్బులు అడిగితే కులం పేరుతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడిన ఒడ్యాల వేణు అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడమే కాకుండా.. నిందితుడిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉండడంతో రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణం అనుపురం (ఆర్ఆర్ కాలనీ)కి చెందిన బొమ్మెళ లక్ష్మికి తిప్పాపూర్ శివారులో ఫ్లాట్ ఉంది. అది అమ్మి కూతురి పెళ్లి చేయలనుకుంది. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ఒడ్యాల వేణు ఫ్లాట్ తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తే కూతురి పెళ్లికి కావాల్సిన రూ.6లక్షలు ఇస్తానని, ఆ తర్వాత డబ్బులిచ్చి ఫ్లాట్ మీ పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మాయమాటలు చెప్పాడు. దీంతో వేణు మాటలు నమ్మి లక్ష్మి రిజిస్ట్రేషన్ చేసింది. డబ్బులివ్వాలని లక్ష్మి నిలదీయగా కులం పేరుతో దూషించడమే కాకుండా చంపుతానని వేణు బెదిరించడంతో 2022లో వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వేణుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత కొద్దిరోజులకు పెద్దమనుషుల సమక్షంలో వేణు లక్ష్మికి ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.8.50లక్షలతో ఒప్పందం చేసుకొని రూ.లక్ష తీసుకున్నాడు. మళ్లీ రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకు తిరగడమే కాకుండా లక్ష్మిని చంపుతానంటూ బెదిరింపులకు దిగాడు. లక్ష్మి ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదైంది. విచారణ చేపట్టిన ఏఎస్పీ నేరు రుజువు కావడంతో వేణుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వేణుపై వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలోనే కాకుండా కరీంనగర్ వన్ టౌన్, టుటౌన్ స్టేషన్లలో పలు చీటింగ్, బెదిరింపు కేసులున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. భూ సమస్యల్లో తలదూర్చి సెటిల్‌మెంట్ చేయడం వంటి కేసులు కూడా నమోదవ్వడంతో నిందితుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయడం జరిగిందని, గతంలో వేణుపై మర్డర్ కేసు కూడా ఉందన్నారు. మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతామని చెప్పారు. జిల్లాలో వేములవాడ పట్టణానికి చెందిన ఒడ్యాల వేణు కరీంనగర్ , వేములవాడ పరిసర ప్రాంతాల్లో భూ తగదాల్లో తలదూర్చి ఇబ్బందులకు గురిచేస్తున్న ఆరోపణలున్న నేపథ్యంలో వేణుకి సంబంధించిన బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు.



# ఘనంగా జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ జన్మదిన వేడుకలు





**ఖైరతాబాద్, ప్రజానావ:** జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ జన్మదిన వేడుకల ను బుధవారం డివిజన్ వ్యాప్తంగా ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ ముందుకొచ్చే నాయకుడు వెల్దండ వెంకటేశ్ అని, ఇటు రాజకీయంగా.. అటు సేవా కార్యక్రమాల్లో నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి అని కొనియాడారు. మరే కార్పొరేటర్‌కు సాధ్యం కాని ఎన్నో అభివృద్ధి పనులను డివిజ న్‌లో చేపట్టి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నేత రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

